క్లుప్తంగా

రెరా దరఖాస్తుల ఆమోదంలో జాప్యం లేదు
బీఏఐ వైస్ చైర్మన్ అత్తలూరి నాగమల్లేశ్వరరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రెరా దరఖాస్తులు జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు ఆమోదం పొందుతున్నాయని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వైస్ చైర్మన్ అత్తలూరి నాగమల్లేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ రెరా అథారిటీ నుంచి అపార్ట్‌మెంట్ ప్రాజెక్ట్స్, రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్స్ రిజిస్ట్రేషన్ విషయంలో నిర్మాణదారులకు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. గతంలో సాంకేతిక సమస్యలతో కొన్ని ఆటంకాలు ఏర్పడినా, పదిహేను రోజుల్లో అన్ని దరఖాస్తులు పరిశీలించి ఆమోదించారని, ప్రస్తుతం ఎప్పటికప్పుడు అప్రూవల్ ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

8న అయ్యప్పకు ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం శ్రీ అయ్యప్పస్వామి మందిరంలో 8వ తేదీ బుధవారం మణికంఠ భక్తబృందం ఆధ్వర్యాన అయ్యప్పస్వామి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు, ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బల్లెం పూర్ణయ్య గురుస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు స్వామి వారికి విశేషంగా అభిషేకం, పూజా కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

'యానిమేల్స్' చిత్ర పోస్టర్ ఆవిష్కరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): యానిమేల్స్ ది వైల్డ్ షాడోస్ సినిమా పోస్టర్‌ను సీనియర్ నటుడు సుమన్ ఆవిష్కరించారు. రూరల్ మండలం గొల్లపూడి పరిధి వైఎస్సార్ కాలనీలోని చిత్ర యూనిట్ కార్యాలయంలో గురువారం పోస్టర్‌ను విడుదల చేశారు. బెజవాడలోని లొకేషన్స్‌లో చిత్రీకరించిన ఈ సినిమాకు సంబంధించిన పలు అంశాల గురించి యూనిట్ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నటుడు సుమన్ మాట్లాడుతూ చిన్న సినిమాల కథ, కథనాలు బాగుంటే ప్రేక్షకులు ఆదరిస్తారన్నారు. చిత్ర నిర్మాత షెహనాజ్, దర్శకుడు లియో భార్గవ్‌లు మాట్లాడుతూ యానిమేల్స్ ది వైల్డ్ షాడోస్ కథ ఆకట్టుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో చిత్ర కథానాయకుడు శ్రీకాంత్, నటులు కుమార్ చంద్ రాయుడు, షఫీ, అర్బాజ్, కుమార్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేని విద్యతో వికాసం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఒత్తిడి లేని విద్యతో వ్యక్తిత్వ వికాసం కలుగుతుందని సైక్రియాటిస్టు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో గురువారం సాయంత్రం మారుతీనగర్ గ్రోయింగ్ మైండ్స్ ప్లేస్కూల్ 5వ వార్షికోత్సవం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆటపాటలతో విద్యను అందిస్తున్న గ్రోయింగ్ మైండ్స్ ప్లేస్కూల్‌ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. గైనకాలజిస్టు డాక్టర్ శ్రీదేవి, వీడీఎస్ లా కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ దివాకర్ బాబు ప్రసంగించారు. అనంతరం చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమాలను స్కూలు డైరెక్టర్ నాగ ప్రసన్న, ప్రతిమ పర్యవేక్షించారు.

గణిత ఉపాధ్యాయుడి సస్పెన్షన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వీరులపాడు మండలం పొన్నవరం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బి. నరేంద్రను సస్పెండ్ చేస్తూ డీఈవో సీవీ రేణుక ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నరేంద్ర విద్యార్థులకు పాఠశాల ప్రారంభమైన నాటి నుంచి బోధన చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారు. దీనిపై వీరులపాడు మండల విద్యాశాఖాధికారి ఇచ్చిన నివేదికతో ఉపాధ్యాయుడు బి. నరేంద్రను సస్పెండ్ చేసినట్లు డీఈవో గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మహిళలు అన్ని రంగాల్లో రానించాలని న్యాయవాది రాధ, ఐద్వా జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐద్వా, డీవైఎఫ్ఐ కమిటీల ఆధ్వర్యంలో సింగ్‌నగర్ 58వ డివిజన్‌లోని వడ్డెరకాలనీలో గురువారం మహిళా సదస్సును నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంలో అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా సెంట్రల్ కార్యదర్శి జి.ఝాన్సీ, డీవైఎఫ్ఐ సెంట్రల్ కార్యదర్శి ఎస్‌కే నిజాముద్దీన్, దేవికుమారి, విజయలక్ష్మి, మాధవి, కాశమ్మ, సుగుణ, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

•నాడు కళాక్షేత్రం.. నేడు తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం



ఆడిటోరియం ముందు గతంలో కళాక్షేత్రం అని ఉన్న పేరు..



నేడు కొత్తగా తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం పేరును ఏర్పాటు చేసిన దృశ్యం

తుమ్మలపల్లి కళాక్షేత్రం పేరును మార్చుతున్నారనే విమర్శలకు మునిసిపల్ అధికారులు సమాధానమిచ్చారు. గతంలో కేవలం కళాక్షేత్రమనే పేరు ఈ ఆడిటోరియంపై ఉండేది. దాతల సహకారాన్ని ప్రజలు నిత్యం జ్ఞప్తికి తెచ్చుకునేలా ఆడిటోరియం ముఖద్వారం వద్ద 'తుమ్మలపల్లి క్షేత్రయ్య వారి కళాక్షేత్రం' పేరును శాశ్వతంగా ఉండేలా ఏర్పాటు చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సంక్షేమ పథకాలతో కాంతులు

'గడప గడప'లో లబ్ధిదారుల సంతోషం

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు తమ జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. 64వ డివిజన్ 284 వార్డు సచివాలయ పరిధిలో 176 గడపలను ఏపీ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, స్థానిక కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మతో కలిసి పర్యటించారు. టెంపుల్ వెనుక వైపు రెండో లైన్లో నివసిస్తున్న బొమ్మాలీ ఉమామహేశ్వరి, అర్చన, అప్పాయమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి మా పిల్లలకు అమ్మఒడి రెండు దఫాలు అందాయని, డ్వాక్రా గ్రూపుల్లో రుణమాఫీ జరిగిందని, ఇంటి స్థలాలను సూరంపల్లి, కొండపావులూరు గ్రామాల్లో ప్రభుత్వం అందజేసిందని తెలిపారు. నెలనెలా ప్రభుత్వం అందించే వైఎస్సార్ పెన్షన్ కానుక కూడా వస్తోందన్నారు. కరెంటు స్తంభం ప్రమాదకరంగా ఉందని దాన్ని తొలగించాలని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే ఆ శాఖ ఏఈ నాగేశ్వరావుతో మాట్లాడి విద్యుత్ స్తంభం తొలగించాలని చెప్పారు. స్థానికులు డ్రైనేజీ సమస్యలను వివరించారు, కొంతమంది రేషన్ కార్డులను కోరారు. వీటిపై ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడారు. ప్రజాశక్తి నగర్లో ప్రజలు ఆప్యాయంగా పలకరించి హారతులతో స్వాగతం పలికారు. గతంలో తాము ఎదుర్కొన్న సమస్యలను, ఈ ప్రభుత్వంలో జరుగుతున్న మేలును వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మల్లాది విష్ణు విలేకరులతో మాట్లాడారు. 284 సచివాలయ పరిధిలో రూ.7.15 కోట్ల సంక్షేమాన్ని మూడున్నరేళ్లలో అందజేసినట్టు వెల్లడించారు. వైఎస్సార్ పింఛన్ కానుకను ప్రతి నెలా 293 మందికి క్రమం తప్పకుండా ఇంటి వద్దకే పింఛన్ అందిస్తున్నట్లు తెలిపారు. సచివాలయ పరిధిలో ప్రజాశక్తి నగర్, ప్రధాన రహదారిని నిర్మించనున్నట్లు వివరించారు. కండ్రిక నుంచి పాతపాడు వరకు రహదారి నిర్మాణాన్ని త్వరలో ప్రారంభిస్తామని తెలియచేశారు. 'నిషేధిత జాబితాలోని భూములకు సంబంధించి' నున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న వేలాది అర్జీలకు పరిష్కారం లభించనుందన్నారు. విశాఖలో జరిగే సమ్మిట్ విజయవంతమై యువతకు ఉద్యోగావకాశాలు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు నందెపు జగదీష్, ఏఎంటహెచ్ రామకోటేశరావు, సీడీఓ జగదీశ్వరి, వైసీపీ డివిజన్ కోఆర్డినేటర్ ఎస్‌కె.ఇస్మాయిల్, అధ్యక్షులు జె.శివ, నాయకులు యర్రగొర్ల శ్రీరాములు, పందిరి వాసు, అక్కిశెట్టి నారాయణ, మేడా రమేష్, తదితరులు పాల్గొన్నారు.



'గడప గడప'లో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

మహిళలకు ఆటల పోటీలు



క్యారమ్స్ ఆడుతున్న ఉద్యోగులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏపీ ఎన్జీవో రాష్ట్ర మహిళా విభాగం ఆధ్వర్యంలో గురువారం విజయవాడ లోని ఏపీ ఎన్జీవో హోంలో ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఉద్యోగులకు క్యారమ్స్, మెమరీ గేమ్, అంత్యాక్షరి, చెస్ పోటీలు జరిగాయి. శుక్రవారం నృత్య పోటీలు, పాటల పోటీలు, వ్యాసరచన పోటీలు జరుగుతాయని, నగరంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు పాల్గొనాలని ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, పశ్చిమ కృష్ణా ఎన్జీవో అధ్యక్షులు ఏ విద్యాసాగర్ పిలుపునిచ్చారు. కార్యక్రమాలను ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వి. నిర్మల కుమారి, కన్వీనర్ మాధవి నిర్వహించారు.

లైంగికదాడి కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న రూరల్ పోలీసు స్టేషన్ పరిధి సుందరయ్యనగర్‌కు చెందిన వ్యక్తి పై శాంతినగర్‌కు చెందిన మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం లైంగికదాడి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం సుందరయ్యనగర్‌కు చెందిన పుట్ట సుభాష్ శాంతినగర్‌కు చెందిన ఒక మహిళతో వివాహేతర సంబంధం ఏర్పరచుకుని విడతల వారీగా రూ. 16 లక్షల ఆమె నుంచి తీసుకున్నాడు. మహిళ ఇంటి వద్ద డబ్బుల లెక్కల్లో తేడా రావడంతో ఇంట్లోవారు ఆమెను గట్టిగా నిలదీశారు. దీంతో డబ్బులు తీసుకున్న సుభాష్‌ను డబ్బులు తిరిగి ఇవ్వాలని ఆమె సార్లు వత్తిడి చేసింది. ఇలా వత్తిడి చేస్తే మన గుట్టు రట్టు చేస్తానని సుభాష్ ఆమెను బెదిరించాడు. ఈ విషయం మహిళ ఇంటి వద్ద తెలిసి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

ప్రతినెలా పెన్షన్ల పండగ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): 'వైఎస్సార్ పెన్షన్ కానుక' రాష్ట్రంలో ప్రతి నెలా ఒక పెద్ద పండగలా జరుగుతోందని, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఈ సంక్షేమ పథకం ఎంతో అండగా నిలుస్తుందని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. సింగ్‌నగర్ 59వ డివిజన్‌లో 'వైఎస్సార్ పెన్షన్ కానుక'లను గురువారం ఆయన పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, అమిత్ తదితరులు పాల్గొన్నారు. 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటలో కార్పొరేటర్ ఇసరపుదేవి వైఎస్సార్ పెన్షన్ కానుకను అందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లెల చెన్నకేశవరెడ్డి, ఇసరపు రాజు, కాళ్ల ఆదినారాయణ, నెల్లి గోవింద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): అవ్వ తాతలు, దివ్యాంగులకు పంగగ వాతావరణంలో ప్రతి నెలా పింఛన్‌లు పంపిణీ చేస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి అన్నారు. 27వ డివిజన్‌లో నడవలేని అనారోగ్యంతో ఉన్న వృద్ధురాలు బత్తుల సామ్రాజ్యంకు గురువారం వలంటీర్, వార్డు సచివాలయం సిబ్బందితో కలిసి పింఛన్‌ను అందజేశారు. కార్యక్రమంలో వార్డు సచివాలయం అడ్మిన్ నాగకీర్తి, వలంటీర్ తస్లీమా తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌తోనే సమాజాభివృద్ధి



ప్రదర్శనలు తిలకిస్తున్న ఇంతియాజ్



విద్యార్థుల ప్రదర్శనలు



విద్యార్థుల నమూనా అంశాలను పరిశీలిస్తున్న అతిథులు

సెర్ప్ సీఈవో ఇంతియాజ్

గుణదల(విజయవాడ తూర్పు): దైనందిన జీవితంలో అంతర్భాగమైన సైన్స్ ద్వారా ద్వారానే సమాజాభివృద్ధి జరుగుతుందని సెర్ప్ సీఈవో ఎ.ఎం.డి.ఇంతియాజ్ అన్నారు. సేఫ్(స్టెప్ ఎహెడ్ ఫర్ ఈక్వాలిటీ), ఆంధ్ర లయోల కాలేజీ సంయుక్తంగా నగరంలోని లయోల కాలేజీలో గురువారం నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో–2023ను ఇంతియాజ్ ప్రారంభించి మాట్లాడారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వస్తున్న ఎన్నో మార్పులను విద్యార్థులు అవగతం చేసుకుని ఇతరులకు జ్ఞానం పంచాలన్నారు. సైన్స్, టెక్నాలజీతోనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కనెక్ట్ ఆంధ్ర సీఈవో కె.శివశంకర్ మాట్లాడుతూ పరిశీలన, పరిశోధన, ప్రశ్నించే తత్వాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. ప్రకృతిలోని ప్రతి వస్తువు సైన్స్ పైనే ఆధారపడి ఉందన్నారు. కార్యక్రమంలో సేఫ్ అధ్యక్షురాలు జి.జోత్స్న, లయోల కాలేజీ ప్రిన్సిపాల్ ఫాదర్ జి.ఎ.పి.కిషోర్, కరస్పాండెంట్ జేవీఆర్, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ వై.టి.ప్రభు పాల్గొన్నారు. అనంతరం ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు ప్రదర్శించిన 260 నమూనాలను పరిశీలించారు.

రోడ్డు నిర్మాణానికి సర్వే

పటమట(విజయవాడతూర్పు): పటమటలంక నుంచి పకీర్‌గూడెం వరకు రోడ్డు వేయడానికి స్క్యూ బ్రిడ్జి కింద ఉన్న ఆక్రమణలను సర్వే చేసి రిపోర్టును అందించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. గురువారం నగర పర్యటనలో భాగంగా ఆయన వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్, డిప్యూటీ మేయర్ బెల్లందుర్గతో కలిసి 15వ డివిజన్‌లో పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణ విధానాన్ని, స్థానికుల ఇబ్బందులను ఆయన అడిగి తెలుసుకున్నారు.

రామలింగేశ్వరనగర్‌లోని వీఎంసీ ఖాళీస్థలంలో గ్రీనరి పెంచి పార్కును అభివృద్ధి చేయాలని ఉద్యానవన విభాగం అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.చంద్రశేఖర్, ఏడీహెచ్ శ్రీనివాసు, మాజీ డిప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావు తదితరులు పాల్గొన్నారు.



సింగ్‌నగర్ పైపులరోడ్డు నుంచి కండ్రిక సెంటర్ వరకు ఉన్న ప్రధాన రహదారి డివైడర్‌పై మొక్కలు నాటే ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. 750 మీటర్ల పొడవు ఉన్న డివైడర్ పై ఐదు వేల మొక్కలను వారంలో నాటారు. రహదారులపై పచ్చదనం పెంపొందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



నైపుణ్యం పెంపుతో అభివృద్ధి

కృష్ణలంక(విజయవాడ తూర్పు): మహిళలు వృత్తి విద్యా నైపుణ్యం పెంచుకుని అభివృద్ధి చెందాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ ప్రవీణ అన్నారు. గవర్నర్ పేటలోని ఎం.బి.వి జ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న టైలరింగ్ శిక్షణ తరగతులను గురువారం ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధిని కల్పించే ఇలాంటి వృత్తిలో శిక్షణ పొందితే నలుగురికి ఉపాధి అందచేయవచ్చన్నారు. ఎం.బి. విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ సభ్యులు స్వరూపరాణి మాట్లాడుతూ ఇప్పటికే 7 బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో ఎం.బి.వి జ్ఞాన కేంద్రం మహిళా శిక్షణ విభాగం బాధ్యులు పి.విజయ, రామరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూబీఐ చీఫ్ మేనేజర్ ప్రవీణ

ఎయిమ్స్‌కు సిటీ సర్వీసు నడపాలని వినతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం సాంబమూర్తిరోడ్డు మీదుగా మంగళగిరి ఎయిమ్స్‌కు సిటీ బస్సు నడపాలంటూ గురువారం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ సభ్యులు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎం.వై దానం కు వినతి పత్రం అందజేశారు. పేద, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా నివసించే దేవీనగర్, మధురానగర్, గులాబీతోట, దుర్గాపురం, విజయదుర్గానగర్, కేఎల్‌రావు నగర్, భానునగర్ తదితర ప్రాంతాల వాసులు మంగళగిరి ఎయిమ్స్ వెళ్లాలంటే సిటీ సర్వీసు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మధురానగర్ నుంచి సాంబమూర్తి రోడ్డు మీదుగా రాయన పాడు వరకు వెళ్లే 14ఇ బస్‌లను తిరిగి కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఆర్ఎం.. సానుకూలంగా స్పందించారు. సొసైటీ అధ్యక్షులు డాక్టర్ వసంత కుమార్, కార్యదర్శి కొండాయ గుంట రాము, కోశాధికారి గుర్రం ఏడు కొండలు, మండ రాము పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ సభ్యులు

దోమల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించండి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నియోజకవర్గంలో పెరుగుతున్న దోమల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, యాంటీ లార్వా ఆపరేషన్ డ్రైవ్‌ను యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని తన కార్యాలయంలో మలేరియా విభాగం అధికారులతో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మలేరియా–3, 4, 6 ప్రాంతాల్లో పరిస్థితులకు అనుగుణంగా సిబ్బందిని, ఫాగింగ్ ఆటోలు, హ్యాండ్ స్ప్రేయింగ్ యంత్రాలు పెంచుకోవాలని సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్పొరేషన్ బయాలజిస్ట్ సూర్య నాయక్, మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



మలేరియా విభాగ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి పెద్ద పీట

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని నిరుపేదలకు కూడా రాజ్యాధికారం అప్పగించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా ఎంపికైన పొలిమెట్ల శరత్‌కుమార్.. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాను సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నేతలు ఎండీ హఫీజుల్లా, అమిత్, గెల్లిపోగు రాజు, ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాను కలిసిన శరత్‌కుమార్, ఎస్సీ సెల్ నాయకులు

వేణుగోపాలుని రాజగోపురం పనులు ప్రారంభం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేటలోని శ్రీ సత్యభామ రుక్మిణీ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఆలయ రాజగోపురం నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి, నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు చొరవతో సుమారు కోటి రూపాయ నిధులను సీజీఎఫ్ నుంచి విడుదల చేయించారు. ఆలయ అభివృద్ధి పనులను కొన్ని రోజుల క్రితం ప్రారంభించారు. దీనిలో భాగంగా రాజగోపురం నిర్మాణానికి గురువారం సింహద్వారాన్ని ఏర్పాటు చేసి శంకుస్థాపన పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

ఆహార అలవాట్లు మార్చుకోవాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): జంక్‌ఫుడ్ తినడంతో ఆరోగ్య సమస్యలను కొనితెచ్చుకుంటున్నారని, ఆహార అలవాట్లు మార్చుకోవాలని రాజస్తాన్‌లోని జేజేటీయూ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.భ్రమరాంబిక అన్నారు. ఎంజీ రోడ్డులోని శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం రాబోయే తరాలకు ఆహారం అనే అంశంపై సదస్సు జరిగింది. భ్రమరాంబికా మాట్లాడుతూ యుక్తవయస్సులో స్త్రీలు రుతుస్రావ సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఆహార అలవాట్లు మార్చుకుంటే వీటిని పరిష్కరించుకోవచ్చన్నారు. చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. సదస్సులో ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, జంతు, మత్స్య సాంకేతిక విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు పాతశివాలయంలో కానుకల లెక్కింపు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం (పాతశివాలయం)లో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను ఈ నెల నాలుగో తేదీన లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి హేమలతాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులు ఆ రోజు ఉదయం 7.30గంటలకు పూర్తి వివరాలను ఆలయ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని, సంప్రదాయ దుస్తులు ధరించాలని సూచించారు.

10 కేజీల గంజాయి పట్టివేత

ఆటోనగర్(విజయవాడతూర్పు): పాలకొల్లు నుంచి విజయవాడకు తరలిస్తున్న 10 కేజీల గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. పటమట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాలకొల్లు నుంచి గంజాయి తరలిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. నిఘా పెట్టిన పోలీసులు గంజాయిని ఉన్న కారులో తనిఖీ చేశారు. 10 కేజీల గంజాయి లభ్యమైంది. కారులో ఉన్న పాలకొల్లు ప్రాంతానికి చెందిన సూర్యచంద్రరావును అదుపులోకి తీసుకొని పటమట పోలీసులకు అప్పగించారు. వారు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించింది.

•వీటిని తొలగించరూ..!



మొగల్రాజపురం నిమ్మతోట సెంటర్‌లో నిత్యం రద్దీగా ఉండే రోడ్డుపై ఓ పార్టీకి చెందిన పెద్ద పెద్ద హోర్డింగ్‌లు పెట్టి నెలలు దాటుతున్నా తొలగించడం లేదు. ఎవరైనా చిన్నపాటి బ్యానర్లు కడితే వెంటనే స్పందించే సంబంధిత సిబ్బంది ఇంత పెద్ద హోర్డింగులు తీయక పోవడంతో స్థానికులు ఆశ్చర్యపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీటిని తీయించాలని స్థానికులు కోరుతున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ